క్లుప్తంగా

పేదల పక్షపాతి జగన్

ఎమ్మెల్యే జగ్గిరెడ్డి



గోపాలపురంలో పాస్టర్ కృష్ణకు పార్టీ కండువా వేస్తున్న ఎమ్మెల్యే జగ్గిరెడ్డి

కొత్తపేట: సీఎం జగన్‌మోహన్‌రెడ్డి పేద ప్రజల పక్షపాతి అని ఎమ్మెల్యే, ప్రభుత్వ విప్ చీర్ల జగ్గిరెడ్డి అన్నారు. మండలంలోని వానపల్లి గ్రామానికి చెందిన పాస్టర్ ముమ్మిడి కృష్ణ గోపాలపురం వెళ్లి ఎమ్మెల్యే జగ్గిరెడ్డి సమక్షంలో వైఎస్సార్ సీపీలో చేరారు. కృష్ణకు జగ్గిరెడ్డి పార్టీ కండువా వేసి సాదరంగా ఆహ్వానించారు. ఆయన మాట్లాడుతూ రాష్ట్ర చరిత్రలోనే కాదు దేశ చరిత్రలోనే ఎప్పుడూ ఏ ప్రభుత్వం అమలు చేయని విధంగా రాష్ట్రంలో జగన్ ప్రభుత్వం పేద, మధ్యతరగతి ప్రజల సంక్షేమం, ముఖ్యంగా ఆర్థికాభివృద్ధి లక్ష్యంగా అనేక సంక్షేమ పథకాలు అమలు చేసిందన్నారు. ఆ ప్రజానీకం అండదండలతో జరగనున్న ఎన్నికల్లో మళ్లీ వైఎస్సార్ సీపీ అత్యధిక స్థానాలతో అధికారం చేపట్టనుందన్నారు. కార్యక్రమంలో ఎంపీపీ మార్గన గంగాధరరావు, కొత్తపేట పార్టీ నాయకుడు మూర్కొండ చంద్రరావు తదితరులు పాల్గొన్నారు.

మాదిగలకు వైఎస్సార్ సీపీలో సముచిత స్థానం



ఎంపీ సురేష్‌ను అభినందిస్తున్న ఎమ్మెల్సీ బొమ్మి ఇజ్రాయిల్

మామిడికుదురు: బాపట్ల ఎంపీ, ఆంధ్రప్రదేశ్ ఎస్సీ సెల్ రాష్ట్ర అధ్యక్షుడు నందిగం సురేష్‌ను ఎమ్మెల్సీ బొమ్మి ఇజ్రాయిల్ సోమవారం కలిసి అభినందనలు తెలిపారు. రెండో పర్యాయం ఎంపీ అభ్యర్థిగా సురేష్‌కు అవకాశం కల్పించిన నేపథ్యంలో ఎమ్మెల్సీ ఇజ్రాయిల్, కోనసీమ జిల్లా వైఎస్సార్ సీపీ రైతు విభాగం కార్యదర్శి చేట్ల సత్యనారాయణ, తదితరులు సోమవారం సురేష్‌ని గుంటూరులోని అతని స్వగృహంలో కలసి గజమాలతో సత్కరించారు. సీఎం జగన్‌మోహన్ రెడ్డి మాదిగలకు రాష్ట్రంలో ఏ పార్టీ కూడా ఇవ్వని ప్రాధాన్యం ఇచ్చారని ఆనందం వ్యక్తం చేశారు. పది అసెంబ్లీ సీట్లతో పాటు ఒక ఎంపీ స్థానాన్ని కేటాయించడం హర్షణీయమన్నారు. మాదిగ జాతి వైఎస్సార్ సీపీ అధినేత జగన్‌కు రుణపడి ఉంటుందన్నారు. 75 ఏళ్ల సుదీర్ఘ పోరాటంలో కోనసీమ జిల్లాలో ఎమ్మెల్సీ పదవి మాదిగ జాతికి ఇవ్వడం ముదావహమన్నారు.

వాహనాల తనిఖీ

అంబాజీపేట: సార్వత్రిక ఎన్నికలను పురస్కరించుకుని అంబాజీపేట మండలంలో ప్రధాన రహదారిపై వెళుతున్న వాహనాలను పోలీసులు సోమవారం తనిఖీ చేశారు. ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు ఎస్సై కె.చిరంజీవి పర్యవేక్షణలో పోలీస్ సిబ్బంది వాహనాలను తనిఖీ చేస్తున్నారు. ఎన్నికల నియామవళిని ప్రతి ఒక్కరూ పాటించాలని లేని పక్షంలో చర్యలు తప్పవన్నారు. అక్రమంగా మద్యం తరలించినా, ఎటువంటి ఆధారాలు లేకుండా నగదును తరలిస్తున్నా కేసులు నమోదు చేస్తామని హెచ్చరించారు.

చింతనలంకలో..

అయినవిల్లి: మండలంలోని పలు గ్రామాల్లో సీఐ ప్రశాంత్‌కుమార్ ఆధ్వర్యంలో సీఐఎస్ఎస్ బృందాలతో వాహనాల తనిఖీ జోరుగా నిర్వహిస్తున్నారు. సోమవారం చింతనలంకలో సీఐ, ఎస్సై బి.రాజేష్‌కుమార్ బృందాలుగా ఏర్పడి ఎన్నికల సందర్భంగా మద్యం, నగదు డంప్ కాకుండా ఎన్నికల అధికారులు ఆదేశాల మేరకు వాహనాల తనిఖీ నిర్వహిస్తున్నామన్నారు. ముఖ్యమైన కూడలిలో బీటు వేసి అనుమానం వచ్చిన వాహనాలు ఆపి వాటిని క్షుణ్ణంగా తనిఖీ చేస్తున్నారు. వీటికి సంబంధించిన బిల్లులను పరిశీలిస్తున్నారు.

రెండు బైకులు ఢీ: ఇద్దరికి తీవ్ర గాయాలు

మామిడికుదురు: పాశర్లపూడి–బోడసకుర్రు గ్రామాల మధ్యలోని వైనతేయ గోదావరి నదిపై నిర్మించిన వారధిపై సోమవారం రెండు బైకులు ఢీకొన్న సంఘటనలో ఇద్దరు తీవ్రంగా గాయపడ్డారు. పి.గన్నవరం మండలం నాగుల్లంకకు చెందిన రెడ్డి వీర వెంకటసత్యనారాయణ, గౌరీ పార్వతి దంపతులు అమలాపురం నుంచి బైకుపై వస్తుండగా, పాశర్లపూడి నుంచి మరో బైకుపై వెళ్తున్న అల్లవరం మండలం బోడసకుర్రుకు చెందిన మొగలి రవి ఢీ కొట్టాడు. ఈ ప్రమాదంలో రెడ్డి గౌరీ పార్వతి, మొగలి రవి తీవ్రంగా గాయపడ్డారు. వారిని మొదట అమలాపురం ఏరియా ఆస్పత్రికి, అక్కడి నుంచి మెరుగైన వైద్యం కోసం కాకినాడ జీజీహెచ్‌కు తరలించారు. దీనిపై నగరం పోలీసులకు ఆస్పత్రి వర్గాలు సమాచారం అందించారు. ఎస్సై పి.సురేష్ ఈ ప్రమాదంపై విచారణ చేపట్టారు.

ఆరు ఇసుక, బొండుమట్టి లారీల సీజ్

అయినవిల్లి: రావులపాలెం నుంచి అయినవిల్లి మండలం మీదుగా ముమ్మిడివరం వెళ్తున్న మూడు ఇసుక, మూడు బొండు మట్టి లారీలను సీఐ ప్రశాంత్‌కుమార్ ఆధ్వర్యంలో ఎస్సై బి.రాజేష్‌కుమార్ తన సిబ్బందితో పట్టుకుని సీజ్ చేశారు. ఇసుక, బొండు మట్టికి సంబంధించి ఏ విధమైన రశీదులు చూపించకపోవడంతో వీటిని తదుపరి చర్యలు కోసం సీజ్ చేసి అయినవిల్లి తహసీల్దార్ కార్యాలయానికి అప్పగించినట్లు ఎస్సై తెలిపారు.

తొలిరోజు పరీక్షలు ప్రశాంతం



కొత్తపేటలో పది పరీక్షకు హాజరయ్యే ముందు సరస్వతీదేవికి నమస్కరిస్తున్న విద్యార్థినులు



ముక్తేశ్వరం జెడ్పీ స్కూల్‌లో పరీక్షకు హాజరవుతున్న విద్యార్థులు

కొత్తపేట: పదో తరగతి పబ్లిక్ పరీక్షలు సోమవారం ప్రశాంతంగా ప్రారంభమయ్యాయి. కొత్తపేట మండలంలోని 5 పరీక్ష కేంద్రాల్లో 984 మంది విద్యార్థులకు 952 మంది హాజరు కాగా 32 మంది గైర్హాజరయ్యారు. కొత్తపేట ప్రభుత్వ బాలుర ఉన్నత పాఠశాల సెంటర్‌లో 270 మందికి 265 మంది, జెడ్పీ బాలికోన్నత పాఠశాల సెంటర్‌లో 228 మందికి 212 మంది, స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాలలో 205 మందికి 200 మంది, వానపల్లిలో 137 మందికి 132 మంది, అవిడి చప్పిడివారిపాలెం జెడ్పీ ఉన్నత పాఠశాల సెంటర్‌లో 144 మందికి 143 మంది విద్యార్థులు హాజరయ్యారని ఎంఈఓ మట్టపర్తి హరిప్రసాద్ తెలిపారు. ఆయా సెంటర్లలో ఎంఈఓ హరిప్రసాద్ ఆధ్వర్యంలో చీఫ్ సూపరింటెండెంట్లు, డిపార్ట్‌మెంటల్ ఆఫీసర్ల పర్యవేక్షణలో ఇన్విజిలేటర్లు పరీక్షలు నిర్వహించారు. విద్యార్థులకు ఆయా సెంటర్లలో వానపల్లి, అవిడి పీహెచ్‌సీల వైద్య సిబ్బంది వైద్యశిబిరాలు ఏర్పాటు చేశారు. ఎస్సై ఎం.అశోక్ ఆధ్వర్యంలో పోలీస్ బందోబస్తు నిర్వహించారు.

అంబాజీపేటలో..

అంబాజీపేట: మండలంలో సోమవారం జరిగిన పది పబ్లిక్ పరీక్షలకు ముగ్గురు విద్యార్థులు గైర్హజరైనట్లు ఎంఈఓ కె.వెంకటేశ్వరరావు, మోకా ప్రకాష్ తెలిపారు. అంబాజీపేటలో 143కి 142, తొండరంలో 159కి 158, పుల్లేటికుర్రులో 188కి 187 మంది విద్యార్థులు హాజరయ్యారు. మూడు కేంద్రాల్లోనూ పది పరీక్షలు ప్రశాంతంగా జరిగాయన్నారు. విద్యార్థులకు అర్థమయ్యే రీతిలో రూమ్‌లను బోర్డులపై ఉంచారు.

మామిడికుదురులో..

మామిడికుదురు: మామిడికుదురు మండలంలోని ఆరు కేంద్రాల్లో పదో తరగతి పరీక్షలు సోమవారం ప్రశాంతంగా జరిగాయి. మొత్తం 1100 మంది విద్యార్థులకు గాను 1068 మంది విద్యార్థులు హాజరయ్యారని, 32 మంది గైర్హాజరయ్యారని ఎంఈఓలు లక్ష్మీనారాయణ, వెంకన్నబాబు తెలిపారు. 561 మంది బాలురకు గాను 543 మంది, 539 మంది బాలికలకు గాను 525 మంది పరీక్షలు రాశారన్నారు. మామిడికుదురు, మొగలికుదురు జెడ్పీహెచ్ స్కూల్‌తో పాటు ప్రైవేటు స్కూల్‌ల్లో, అప్పనపల్లి, లూటుకుర్రు, పాశర్లపూడి కేంద్రాల్లో పరీక్షలు జరిగాయన్నారు.

848 మంది విద్యార్థుల హాజరు

పి.గన్నవరం: మండలంలో సోమవారం జరిగిన పదో తరగతి పరీక్షలకు 848 మంది విద్యార్థులు హాజరయ్యారని ఎంఈఓ కోన హెలీనా తెలిపారు. మొత్తం 857 మంది విద్యార్థులకు గాను 9 మంది పరీక్షలకు గైర్హాజరయ్యారు.

రావులపాలెంలో..

రావులపాలెం: మండలంలోని ఆరు కేంద్రాల్లో ప్రారంభమైన పబ్లిక్ పరీక్షల్లో తొలిరోజు 1171 మంది పరీక్షలు రాయాల్సి ఉండగా, 38 మంది గైర్హుజరవడంతో 1133 మంది పరీక్షలు రాసినట్లు ఎంఈఓ బి.శ్రీనివాసరాజు తెలిపారు.

717 మంది హాజరు

అయినవిల్లి: పదో తరగతి పరీక్షలకు అయినవిల్లి మండలం నుంచి 723 మందికి గాను 717 మంది విద్యార్థులు హాజరు కాగా ఆరుగురు విద్యార్థులు గైర్హాజరైనట్లు ఎంఈఓ జేవీ కనకదుర్గ తెలిపారు. .

ఆత్రేయపురంలో..

ఆత్రేయపురం: మండలంలో మూడు పరిక్షా కేంద్రాల్లో 558 మంది విద్యార్థులకు గాను 544 మంది విద్యార్థులు హాజరుకాగా, 14 మంది విద్యార్థులు గైర్హాజరయ్యారు.

ఆలమూరులో..

ఆలమూరు: మండలంలోని ఏడు ప్రభుత్వ, జెడ్పీ హైస్కూల్, ప్రైవేట్ పాఠశాల విద్యార్థులతో సప్లిమెంటరీ పరీక్షలకు సంబంధించి 935 మంది విద్యార్థులు పాల్గొనవలసి ఉండగా అందులో 32 మంది విద్యార్థులు గైర్హాజరయ్యారు.

నూకాంబిక అమ్మవారి ఉత్సవాలపై సమీక్ష

- అధికారులందరూ సమన్వయంతో పని చేయాలి
- కొత్తపేట ఆర్డీవో జీవీవీ సూచన



ఆలమూరులోని తహసీల్దార్ కార్యాలయంలో నూకాంబిక అమ్మవారి ఉత్సవాలపై సమీక్ష చేస్తున్న ఆర్డీవో తదితరులు

ఆలమూరు: మండలంలోని చింతలూరులో వేంచేసిన నూకాంబిక అమ్మవారి జాతర, తీర్థ మహోత్సవాలపై సోమవారం సమీక్ష జరిగింది. ఆలమూరు తహసీల్దార్ కార్యాలయంలో తహసీల్దార్ డీవీఎస్ అనిల్‌కుమార్ ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ కార్యక్రమానికి ఈఓ ఎంఎస్ఆర్ కృష్ణ అధ్యక్షత వహించగా కొత్తపేట ఆర్డీవో కొత్తపేట ఆర్డీవో, ఉత్సవ కోఆర్డినేషన్ చైర్మన్ జీవీవీ సత్యనారాయణ, జిల్లా దేవదాయ శాఖ అసిస్టెంట్ కమిషనర్ నాగమల్లేశ్వరరావు, రామచంద్రపురం దేవదాయ శాఖ ఇన్‌స్పెక్టర్ ఎం.బాలాజీ రాంప్రసాద్ ముఖ్య అతిథులుగా పాల్గొన్నారు. ఏప్రిల్ ఏడున జాతర, ఎనిమిదిన తీర్థం ఘనంగా నిర్వహించేందుకు, భక్తులకు కనీస సౌకర్యాల కల్పనకు తీసుకోవలసిన చర్యలపై మండల స్థాయి అధికారులు సమీక్ష జరిపారు. వైద్యారోగ్యశాఖ, పంచాయతీరాజ్, ఆర్‌డబ్ల్యూఎస్ శాఖలతో చర్చలు జరిపి జాతర, తీర్థ మహోత్సవాల నిర్వహణకు తీసుకోవలసిన చర్యలను అడిగి తెలుసుకున్నారు. శాంతి భద్రతల నిర్వహణపై ప్రత్యేక దృష్టి సారించాలని, వేసవి దృష్ట్యా తాగునీటి కొరత రాకుండా పకడ్బందీ ఏర్పాట్లు చేసుకోవాలని అగ్నిమాపక దళ వాహనాన్ని అందుబాటులో ఉంచుకోవాలని కోరారు. ఈసందర్భంగా స్థానికులు, అధికారులతో చర్చించి తగిన సలహాలు అందజేసి సూచనలు స్వీకరించారు.

అభివృద్ధి పనులు త్వరితగతిన పూర్తి చేయాలి

ఏప్రిల్ ఏడు నుంచి నెల రోజుల పాటు నిర్వహించే నూకాంబిక అమ్మవారి జాతర, తీర్థ మహోత్సవాల దృష్ట్యా ఆలయ అభివృద్ధి పనులను త్వరితగతిన పూర్తి చేసే విధంగా దేవదాయశాఖను ఆర్డీవో జీవీవీ కోరారు. భక్తులకు ఎటువంటి అసౌకర్యం లేకుండా ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేయాలని విజ్ఞప్తి చేశారు. లక్షలాది మంది భక్తులు వచ్చి అమ్మవారిని దర్శించుకునే అవకాశం ఉన్నందున అధికారులందరూ సమన్వయంతో పని చేయాలన్నారు. డీఎల్‌పీఓ రాజేశ్వరరావు, ఎంపీడీఓ ఎ.మేరీ రోజ్,స ఐఎం రామ్‌కుమార్, ఎస్సై ఎల్.శ్రీను నాయక్, జేఏ డి.భాస్కర శ్రీనివాస్, వైద్యాధికారి పి.భవానీశంకర్ తదితరులు పాల్గొన్నారు.

తాచుపాము హల్‌చల్

మామిడికుదురు: బి.దొడ్డవరంలో ఐదడుగుల తాచుపాము సోమవారం హల్‌చల్ చేసింది. చింతపల్లి శ్రీను ఇంటికి సమీపాన ఇటుకల గుట్టలో పాము చేరడంతో స్థానికులు కలవరపాటుకు గురయ్యారు. ఐదడుగుల తాచుపామును చూసి బేజారెత్తిన స్థానికులు అప్పనపల్లికి చెందిన స్నేక్ క్యాచర్ యాళ్ల ప్రకాశరావును ఆశ్రయించారు. అతను అక్కడకు చేరుకుని తాచుపామును సంచిలో బంధించి జన సంచారం లేని ప్రదేశానికి తీసుకువెళ్లి విడిచి పెట్టడంతో స్థానికులు ఊపిరి పీల్చుకున్నారు.

జగనే మళ్లీ సీఎం కావాలి



సఖినేటిపల్లి మూడుతూములు సెంటర్లో ఎంపీ అభ్యర్థి రాపాక, ఎమ్మెల్యే అభ్యర్థి గొల్లపల్లిని సత్కరిస్తున్న క్యాడర్

సఖినేటిపల్లి: ఆంధ్రప్రదేశ్‌ను దేశంలోనే అగ్రగామిగా తీర్చిదిద్దిన సీఎం జగన్‌మోహన్‌రెడ్డిని వచ్చే ఎన్నికల్లో మరోసారి సీఎంగా గెలిపించుకోవాల్సిన అవసరం ఉందని ఎమ్మెల్యే, అమలాపురం పార్లమెంటరీ అభ్యర్థి రాపాక వరప్రసాదరావు, రాజోలు అసెంబ్లీ అభ్యర్థి గొల్లపల్లి సూర్యారావు అన్నారు. ఇందుకు గాను వైఎస్సార్ సీపీ గెలుపే లక్ష్యంగా సమష్టి కృషి చేయాలని వారు పిలుపునిచ్చారు. సోమవారం సఖినేటిపల్లి మూడుతూముల సెంటర్లో వైఎస్సార్ సీపీ మండల అధ్యక్షుడు కుసుమ చంద్రశేఖర్ అధ్యక్షతన ప్రజాప్రతినిధులు, నాయకులు, కార్యకర్తలతో ఆత్మీయ సమావేశం నిర్వహించారు. ఇందులో ఎంపీ, ఎమ్మెల్యే అభ్యర్థులుగా ఎంపికైన రాపాక, గొల్లపల్లిలను పార్టీ క్యాడర్ శాలువాలతో ఘనంగా సత్కరించారు. ఎమ్మెల్యే రాపాక మాట్లాడుతూ, పాలనా సంస్కరణల ద్వారా విప్లవాత్మక నిర్ణయాలకు నాంది పలికిన ఇటువంటి ముఖ్యమంత్రిని మరోసారి గెలిపించుకుంటే పేద, బడుగు, బలహీన వర్గాల జీవన ప్రమాణాలు మ రింత మెరుగుపడతాయన్నారు. రాజోలు అసెంబ్లీ అభ్యర్థి గొల్లపల్లి మాట్లాడుతూ, సీఎం వైఎస్ జగన్ పాలనలో రాష్ట్రంలో బలహీన వర్గాలు ప్రజలు ఎన్నో సంక్షేమ పథకాలు ద్వారా లబ్ధి పొందారన్నా రు. అలాగే మహిళా సాధికారతకు సీఎం జగన్ పెద్ద పీట వేశారన్నారు. సంక్లిష్ట సమయంలో సీఎం జగ న్ తనను చేరదీసి, రాజోలు అసెంబ్లీ అభ్యర్థిగా మళ్లీ మీ ముందుకు పంపించారన్నారు. జెడ్పీటీసీ దొండపాటి అన్నపూర్ణ, ఎంపీపీ వీరా మల్లిబాబు, వైస్ ఎంపీపీలు రాపాక దీవెన కుమారి, రుద్రరాజు చిన రాజా, మండల కో ఆప్షన్ మెంబర్ బళ్ల నోబుల్ ప్ర భాకర్, నెడ్ క్యాప్ డైరెక్టర్ పాటి శివకుమార్, మండ ల యూత్ అధ్యక్షుడు నల్లి సుధీర్, చేనేత విభాగం ప్రతినిధి జాన శంకరరావు, ఎంపీటీసీలు కట్టా వెంకాయమ్మ, జానలక్ష్మీదుర్గ సూర్యావతి పాల్గొన్నారు.

మాట ఇస్తే తప్పని నాయకుడు సీఎం జగన్



వాకలగరువులో బూత్ కన్వీనర్లకు కిట్లను అందిస్తున్న ఎమ్మెల్యే అభ్యర్థి, జెడ్పీ చైర్మన్ వేణుగోపాలరావు

అంబాజీపేట: ఎన్నికల్లో ఇచ్చిన హామీలన్నింటినీ సీఎం జగన్‌మోహన్‌రెడ్డి నెరవేర్చి మాట మీద నిలిచే నాయకుడిగా పేరు తెచ్చుకున్నారని ఉమ్మడి జిల్లా జెడ్పీ చైర్మన్, ఎమ్మెల్యే అభ్యర్థి విప్పర్తి వేణుగోపాలరావు అన్నారు. తొండవరం, వాకలగరువు గ్రామాల్లో వైఎస్సార్ సీపీ మండల శాఖ అధ్యక్షుడు విత్తనాల ఇంద్రశేఖర్ అధ్యక్షతన పార్టీ సమావేశం సోమవారం జరిగింది. ఎమ్మెల్యే అభ్యర్థి వేణుగోపాలరావు మాట్లాడుతూ గత ఎన్నికల్లో ఇచ్చిన మాటను నిలబెట్టుకున్న సీఎం జగన్‌మోహన్‌రెడ్డి ఇతర దేశాల్లో ఆదర్శంగా నిలిచి మన్ననలు పొందుతున్నారన్నారు. రానున్న సార్వత్రిక ఎన్నికల్లో మరోసారి వైఎస్సార్ సీపీని గెలిపించుకుంటేనే ప్రతి పేదవాడికి మేలు చేకూరుతుదన్నారు. సీఎం జగన్ అందిస్తున్న సువర్ణ పాలనకు ప్రజలంతా అండగా నిలిచి ఆశీర్వదించాలన్నారు. రానున్న ఎన్నికల్లో ఎమ్మెల్యే అభ్యర్థిగా పోటీ చేస్తున్న తనను ఆశీర్వదించాలని కోరారు. పార్టీ ముఖ్యనాయకులందరినీ సమన్వయం చేసుకుని ఎన్నికల ప్రచారం చేస్తానన్నారు. పార్టీ విజయానికి ప్రతి ఒక్కరూ సైనికుల్లా పనిచేయాలని కోరారు. అన్ని వర్గాలకు మేలు చేసిన పార్టీని గెలుపించుకుంటే రాబోయే రోజులన్నీ స్వర్ణయుగమన్నారు. అనంతరం వేణుగోపాలరావును పలువురు సత్కరించారు. అంతకుముందు బూత్ కన్వీనర్‌లకు కిట్లను అందజేశారు. కార్యక్రమంలో ఎంపీపీ దొమ్మేటి వెంకటేశ్వరరావు, జెడ్పీటీసీ బూడిద వరలక్ష్మి , ఉభయ గోదావరి జిల్లాల గ్రీవెన్స్ కన్వీనర్ పేరి శ్రీనివాస్, మండల జేసీఎస్ కన్వీనర్ దొమ్మేటి సత్యమోహన్, జిల్లా రైతు విభాగం కార్యదర్శి కొర్లపాటి కోటబాబు, వెన్నపు రాంబాబు, కేతా రాజు, వాకపల్లి శ్రీనివాస్, ముత్తాబత్తుల మణిరత్నం, మద్దింశెట్టి మల్లిబాబు పాల్గొన్నారు.

ఘనంగా శ్రీలక్ష్మీ వేంకటేశ్వరస్వామి బ్రహ్మోత్సవాలు

ఆత్రేయపురం: గ్రామంలో వేంచేసిన శ్రీలక్ష్మీ వేంకటేశ్వరస్వామి ఆలయంలో సోమవారం స్వామి బ్రహ్మోత్సవాలు కన్నుల పండువగా నిర్వహించారు. స్వామి వారి గరుడ వాహనోత్సవం, మహాసుదర్శన హోమం తదితర పూజలను ఆలయ చైర్మన్ పాతపాటి వెంకట సత్యనారాయణరాజు– రాజ్యలక్ష్మి దంపతులు, సోదరులు, కుటుంబ సభ్యులు స్వామికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఉదయం స్వామికి సంకల్పం, విష్వక్సేన పూజ, పుణ్యాహవాచనం తదితర పూజలను వైఖానస ఆగమ శాస్త్రం ప్రకారం పండితులు, అర్చకుల ఆధ్వర్యంలో పూజలను వైభవంగా నిర్వహించారు. సాయంత్రం శంకు, చక్ర నామార్చన, హారతి, తీర్థప్రసాదాలను వితరణ చేశారు. అలాగే గరుడ వాహనంపై స్వామి వారిని గ్రామంలో ప్రధాన వీధుల గుండా వైభవంగా గరుడ వాహనోత్సవం నిర్వహించారు. కార్యక్రమాలకు ముఖ్యఅతిథిగా మాజీ టీటీడీ చైర్మన్ కనుమూరి బాపిరాజు, అన్నపూర్ణ దంపతులు ముఖ్యఅతిథులుగా పాల్గొని స్వామికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అధిక సంఖ్యలో భక్తులు తరలివచ్చి స్వామి వార్ని దర్శించుకున్నారు. ఆలయంలో స్వామివార్ని ప్రత్యేక పుష్పాల తో సర్వాంగ సుందరంగా అలంకరించారు. ఆలయ అర్చకులు భక్తులకు ఇబ్బందులు కలగకుండా ఏర్పాట్లు నిర్వహించారు.

నేటి కార్యక్రమాలు

ఉదయం సంకల్పం, విశ్వక్సేన సేవ, పుణ్యహవచనం , మహాశాంతి హోమం, పూర్ణహుతి, స్వామి వారి చక్ర స్నానం,ధ్వజారోహణ, హారతి, తీర్థ ప్రసాదాలు, వివేష అన్న సమారాధన, పల్లకీ సేవ, సాయంత్రం సంకల్పం, విశ్వక్సేణపూజ, పుణ్యాహచనం, స్వామి వారికి పుష్పయాగం, ఏకాంత సేవా దర్శనం, తీర్థ ప్రసాదాలతో కార్యక్రమాలు ముగుస్తాయని ఆలయ చైర్మన్ రమణరాజు తెలిపారు.

వెంకటేశ్వరరావు కుటుంబానికి పరామర్శ



వెంకటేశ్వరరావు కుటుంబ సభ్యులను పరామర్శిస్తున్న రాపాక, గొల్లపల్లి

రాజోలు: ఇటీవల మృతి చెందిన తాటిపాక వైఎస్సార్ సీపీ గ్రామశాఖ అధ్యక్షుడు పుల్లెల వెంకటేశ్వరరావు కుటుంబ సభ్యులను సోమవారం అమలాపురం పార్లమెంట్ నియోజకవర్గ అభ్యర్థి, ఎమ్మెల్యే రాపాక, రాజోలు నియోజకవర్గ అభ్యర్థి గొల్లపల్లి సూర్యారావులు పరామర్శించారు. వెంకటేశ్వరరావు వైఎస్సార్ సీపీ కార్యక్రమాల్లో చురుగ్గా పాల్గొనేవాడని, ఆయన మృతి పార్టీకి తీరని లోటన్నారు.

యువకుడి మృతి

ఆత్రేయపురం: మండలంలోని నార్కెడ్‌మిల్లి గ్రామానికి చెందిన నల్లి శ్రీకాంత్ (23) పురుగుమందు తాగి మృతి చెందినట్లు రాజమహేంద్రవరం ప్రభుత్వ ఆసుపత్రి నుంచి వచ్చిన సమాచారం మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్సై శ్రీనివాస్ తెలిపారు. యువకుడు బీటెక్ పూర్తి చేశాడు. ఈనెల 17న పురుగులమందు తాగాడు. దీంతో రాజమహేంద్రవరం ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. అక్కడ సోమవారం చికిత్స పొందుతూ మృతి చెందినట్లు వచ్చిన సమాచారం మేరకు కేసు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

సంక్షేమ పథకాల అమలుతో బ్రహ్మారథం



కేశనపల్లిలో పార్టీ నాయకులతో రాజోలు వైఎస్సార్ సీపీ అభ్యర్థి గొల్లపల్లి సూర్యారావు

రాజోలు నియోజకవర్గ అభ్యర్థి గొల్లపల్లి

రాజోలు: రాష్ట్ర ప్రభుత్వం అమలు చేసిన సంక్షేమ పథకాలతో ప్రజలు బ్రహ్మరథం పడుతున్నారని రాజోలు నియోజకవర్గ వైఎస్సార్ సీపీ అభ్యర్థి, మాజీ మంత్రి గొల్లపల్లి సూర్యారావు అన్నారు. సోమవారం ఆయన తాటిపాక, సోంపల్లి గ్రామాల్లో పర్యటించారు. సోంపల్లిలో మండల పార్టీ అధ్యక్షుడు కట్టా శ్రీనివాసరావు, పార్టీ నాయకులు తిరుమాని రాజు, కొల్లాబత్తుల బాలరాజు తదితర ముఖ్య నాయకులను కలిశారు. అలాగే తాటిపాక మాజీ ఎంపీటీసీ గటిగంటి రాఘవేంద్రరావు, పంచాయతీ రాజ్ విభాగం కార్యదర్శి మద్దుల కాసు, చిత్రపు చెన్నారెడ్డి, ముఖ్యనాయకులను కలిశారు. గొల్లపల్లి సూర్యారావు మాట్లాడుతూ రాజోలు నియోజకవర్గంలో రానున్న ఎన్నికల్లో వైఎస్సార్ సీపీ విజయం సాధిస్తుందని ధీమా వ్యక్తం చేశారు. పార్టీ నాయకులు, కార్యకర్తలు నిత్యం ప్రజలతో మమేకం అవుతున్నారన్నారు. మళ్లీ సీఎంగా జగన్ మోహన్ రెడ్డిని గెలుపించుకునేందుకు ప్రజలంతా సిద్ధంగా ఉన్నారన్నారు. సూర్యబలిజ కార్పొరేషన్ డైరెక్టర్ కోటిపల్లి ఎస్తేరురాణి, రాష్ట్ర పార్టీ సంయుక్త కార్యదర్శి బండారు కాశీ తదితరులు పాల్గొన్నారు.

ఐకమత్యంతో ముందుకు సాగుదాం

మలికిపురం: నియోజక వర్గంలో పార్టీ శ్రేణులు, కార్యకర్తలు అంతా ఐకమత్యంతో ముందుకు సాగి వచ్చే ఎన్నికల్లో పార్టీ విజయమే ప్రధాన లక్ష్యంగా ముందుకు సాగుదామని రాజోలు నియోజకవర్గం వైఎస్సార్ సీపీ ఎమ్మెల్యే అభ్యర్థి గొల్లపల్లి సూర్యారావు అన్నారు. సోమవారం మండలంలోని కేశనపల్లిలో సొసైటీ చైర్మన్ యెనుముల నారాయణ స్వామి ఇంటి వద్ద మండల పార్టీ అధ్యక్షుడు అడబాల వీరబ్రహ్మాజీ అధ్యక్షతన గ్రామ కమిటీ సమావేశం జరిగింది. గొల్లపల్లి సూర్యారావు పాల్గొని మాట్లాడుతూ పార్టీ కార్యకర్తలు ఇంటింటికీ వెళ్లి సీఎం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను ప్రజలకు వివరించాలని కోరారు. ప్రతి పక్షాల విమర్శలకు దీటుగా సమాధానం ఇవ్వాలని సూచించారు. కార్యక్రమంలో గ్రామ శాఖ అధ్యక్షుడు యడ్ల జయకృష్ణ, తాడి రంపాల రాజు, అడబాల గోపాలకృష్ణ, దేవ రామదాసు, కొల్లాబత్తుల ఏడుకొండలు, అడబాల కృష్ణారావు, కోరుకొండ రాజు, నల్లి సుందరం, పలివెల సుందరరావు, మంగెన సింహాద్రి పాల్గొన్నారు.

వైఎస్సార్ సీపీకి అండగా నిలవాలి



లూటుకుర్రులో ఎన్నికల ప్రచారంలో పాల్గొన్న వైఎస్సార్ సీపీ అభ్యర్థి వేణుగోపాలరావు

మామిడికుదురు: సంక్షేమ పథకాలు నిరంతరాయంగా కొనసాగాలంటే వైఎస్సార్ సీపీకి ప్రజలు అండగా నిలవాలని పి.గన్నవరం వైఎస్సార్ సీపీ అభ్యర్థి, జెడ్పీ చైర్మన్ విప్పర్తి వేణుగోపాలరావు కోరారు. ఆయన సోమవారం లూటుకుర్రులో పర్యటించారు. పలువురిని కలుసుకుని ఎన్నికల్లో వైఎస్సార్ సీపీకి అండగా నిలవాలని కోరారు. ఎన్నికల్లో ఇచ్చిన హామీలను తూచా తప్పకుండా అమలు చేసిన నేత సీఎం జగన్‌మోహన్‌రెడ్డి అని పేర్కొన్నారు. జనరంజక పాలన అందించేందుకు ప్రజల సహకారం కోరుతున్నామన్నారు. ప్రజలు జగన్‌కు అండగా నిలిచి మరిన్ని అభివృద్ధి, సంక్షేమ పథకాలు ప్రవేశ పెట్టేందుకు మనోధైర్యం ఇవ్వాలని వేణుగోపాలరావు కోరారు. ఆయన వెంట జెడ్పీటీసీ కళిరెడ్డి అంజిబాబు, మండల శాఖ అధ్యక్షుడు కొమ్ముల రాము, పార్టీ నేతలు జక్కంపూడి తాతాజీ, నెల్లి దుర్గాప్రసాద్, తోరం సూర్యభాస్కర్, అడబాల చక్రపాణి, కొప్పాటి జనార్దన్, కొనుకు నాగరాజు, అప్పన రామారావు, గుబ్లింక సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

వైభవంగా చిన్నశేష, హంస వాహనోత్సవాలు

రావులపాలెం: అలిమేలు మంగా పద్మావతి ఆండాళ్ సహిత వేంకటేశ్వరస్వామి 15వ వార్షిక నవాహ్నిక కల్యాణ బ్రహ్మోత్సవాల్లో భాగంగా రెండో రోజు సోమవారం స్వామివారికి చిన్నశేష, హంస వాహనోత్సవాల సేవలు నిర్వహించారు. తొలుతగా బ్రహ్మోత్సవాల్లో భాగంగా స్వామికి ఉదయాన్నే సుప్రభాత సేవ, సహస్ర నామార్చనం తదితర పూజలు నిర్వహించారు. అనంతరం స్వామివారిని చిన్న శేషవాహనంపై గోవిందమాలధారులు పురవీధుల్లో ఊరేగించారు. ఆలయ ప్రధాన అర్చకు వాడపల్లి కమలనాథాచార్యుల ఆధ్వర్యంలో పలు పూజలు జరిపారు. రాత్రికి స్వామివారికి హంస వాహనోత్సవ కార్యక్రమాన్ని కన్నులపండువగా నిర్వహించారు. ఏర్పాట్లను ఆలయ కమిటీ సభ్యులు పర్యవేక్షించారు.

ఉచిత కంటి వైద్య శిబిరం

కొత్తపేట: స్థానిక తాలూకా ప్రభుత్వ పెన్షనర్ల సంఘ భవనంలో సోమవారం ఉచిత కంటి వైద్య శిబిరం నిర్వహించారు. పెన్షనర్ల సంఘం ఆధ్వర్యంలో రాజమహేంద్రవరం అకీరా నేత్ర వైద్యశాల వారి సౌజన్యంతో నిర్వహించిన ఈ శిబిరంలో కంటి వైద్య నిపుణులు డాక్టర్ వి.ప్రభుసాయి సుమారు 50 మందికి కంటి పరీక్షలు నిర్వహించి 14 మందికి శుక్లాల ఆపరేషన్లు చేయవలసి ఉందని గుర్తించారు. ఆరుగురి కళ్లద్దాలు మార్చుకోవాలని సూచించారు. ఆపరేషన్లు అవసరమైన వారు రాజమహేంద్రవరం అకీరా నేత్ర వైద్యశాలకు వస్తే ఉచితంగా ఆపరేషన్లు చేస్తామని డాక్టర్ ప్రభుసాయి తెలిపారు. కార్యక్రమంలో పెన్షనర్ల సంఘం అధ్యక్షుడు ఏడిద సత్తిరాజు, ప్రధాన కార్యదర్శి అజ్జరపు వెంకటసుబ్బారావు, కోశాధికారి ఎస్వీ రమణమూర్తి, జిల్లా, తాలూకా సంఘం ప్రతినిధులు కాశి రాజేంద్రప్రసాద్, ఆచంట విద్యాసాగర్, కముజు భాస్కరరావు, బొక్కా సత్యనారాయణ, అప్పారి లక్ష్మీ వెంకటసత్యనారాయణ పాల్గొన్నారు.

జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్‌గా శాంతకుమారి

రాజోలు: విద్యను అభ్యసించిన కళాశాలకే ప్రిన్సిపాల్‌గా బాధ్యతలు తీసుకోవడం చాలా సంతోషంగా ఉందని రాజోలు ప్రభుత్వ జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్ జోగి శాంతకుమారి అన్నారు. నూతన ప్రిన్సిపాల్‌గా బాధ్యతలు స్వీకరించిన శాంతకుమారిని సోమవారం అధ్యాపకులు, అధ్యాపకేతర సిబ్బంది అభినందనలు తెలిపారు. అమలాపురం మహిళా కళాశాలలో జూనియర్ లెక్చరర్‌గా విధులు నిర్వహిస్తూ ఈ నెల 15న పదోన్నతి బదిలీల్లో భాగంగా రాజోలు ప్రిన్సిపాల్‌గా బాధ్యతలు స్వీకరించారు. 1992–94 సంవత్సరాల్లో ఇంటర్, డిగ్రీ కూడా ఇదే కళాశాలలో పూర్తి చేశానన్నారు. విద్యార్థులకు, కళాశాలకు అవసరమైన మౌలిక సదుపాయాలు కల్పన, ప్రైవేటు కళాశాలలకు దీటుగా ఫలితాలు సాధనపై కృషి చేస్తామన్నారు. ఇన్‌చార్జి ప్రిన్సిపాల్ అంబేడ్కర్, అధ్యాపకులు శ్రీరాములు, రాజు తదితరులు శాంతకుమారికి అభినందనలు తెలిపారు.

శ్రీసీతారామ లక్ష్మణ విగ్రహ ప్రతిష్ఠ

ఆలమూరు: మండలంలోని పెదపళ్ల తూర్పు వీధి రామాలయంలో సోమవారం నూతన సీతారామ లక్ష్మణ విగ్రహ పునః ప్రతిష్ఠ అత్యంత వైభవంగా జరిగింది. వైఖానస పద్ధతిలో ప్రముఖ వేద పండితుల వాడపల్లి గోపాలాచార్యస్వామి ఆధ్వర్యంలో పురోహితుల బృందం ఈ ప్రతిష్ఠాపన మహోత్సవాన్ని నిర్వహించారు. అనంతరం యంత్ర స్థాపన, కళావాహన గోదర్శనం, శాంతికారక కల్యాణం తదితర కార్యక్రమాలను నిర్వహించారు. పరిసర ప్రాంతాల నుంచి అధిక సంఖ్యలో భక్తులు పాల్గొని ఈ ఉత్సవాన్ని తిలకించారు. ఈసందర్భంగా నూతన విగ్రహాలకు ప్రత్యేక పల్లకీపై ఊరేగింపు జరిపారు. అలాగే ఆయలం వద్ద ఏర్పాటు చేసినపలు ఆధ్యాత్మిక, సాంస్కృతిక కార్యక్రమాలు అలరించాయి.

మృతుడి కుటుంబానికి సాయం అందజేత



అంతర్వేదికరలో మృతుడి కుటుంబానికి సాయం చేస్తున్న ఎమ్మెల్యే రాపాక

సఖినేటిపల్లి: మండలంలోని అంతర్వేదికరకు చెందిన మృతుడు కె.కుమారరత్నం కుటుంబానికి సోమవారం రాజోలు ఎమ్మెల్యే రాపాక వరప్రసాదరావు రూ.10 వేల ఆర్థిక సాయం పంపిణీ చేశారు. కువైట్ తెలుగు క్రైస్తవ సంఘం, పశ్చిమగోదావరి జిల్లాకు చెందిన కుమార్ రాజు, సఖినేటిపల్లికి చెందిన రాపాక ఆదాం ప్రసాద్‌లు పై మొత్తాన్ని సమకూర్చారు. కువైట్‌లోని ఒఫ్రా ఏరియాలో ఇటీవల గుండెపోటుతో కుమారరత్నం మరణించారని దాతలు తెలిపారు. మంచి సేవలందిస్తున్న కువైట్ తెలుగు చర్చి సభ్యులకు ఎమ్మెల్యే అభినందనలు తెలిపారు. గెడ్డం అమ్ములు, నల్లి శివకుమార్, కె.అశోక్, ఆర్.వెంకట్, చింతా రాజబాబు, చింతా ప్రసాద్, సూర్య, రాజేష్ తదితరులు పాల్గొన్నారు.

కిడ్నీ బాధిత చిన్నారికి ఆర్థిక సాయం



పాపకు సాయం అందజేస్తున్న కాశీ అన్నపూర్ణాదేవి సేవా సంస్థ సభ్యులు

రావులపాలెం: కిడ్నీ వ్యాధితో బాధపడుతున్న చిన్నారికి స్థానిక కాశీ అన్నపూర్ణాదేవి సేవా సమితి సభ్యులు రూ.23 వేల ఆర్థిక సాయం అందజేసినట్టు సభ్యులు సోమవారం తెలిపారు. మండలంలోని గోపాలపురం గ్రామానికి చెందిన పాలూరి మీనాక్షి నాగేశ్వరత్నం (3) కిడ్నీకి సంబంధించిన వ్యాధితో బాధపడుతుంది. ఈ పాప తండ్రి చనిపోయారు. తల్లి చాలా ఇబ్బందులు పడుతూ వైద్యం చేయిస్తున్నారు. వైద్యానికి చాలా ఖర్చు అవుతుండటంతో అంత స్తోమత లేకపోవడంతో కాశీ అన్నపూర్ణ దేవి సేవా సంస్థను సహాయం కోరారు. దీంతో పాప ఇంటికి వెళ్లి సంస్థ సభ్యుల చేతుల మీదుగా రూ.23 వేల నగదు సాయాన్ని అందజేసినట్టు తెలిపారు.